# నవభూమి మెదక్

అనుబంధం

27 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజిలు:5

www.epaper.navabhoomi.in




# పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం



**సిద్దిపేట–నవభూమి :** ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పార్టీలకతీతంగా సిద్దిపేట జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని అటవీ పర్యావరణ, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఆమె అధ్యక్షతన జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బకి వెంకటయ్య, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, డాక్టర్ వంటేరు యాదవరెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయం, మత్స్య, పౌర సరఫరా లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ, అటవీ, వైద్య, ఆరోగ్యం, సెట్విన్, విద్య, విద్యుత్ తదితరశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ..వివిధ పథకాల అమలు కాలపరిమితిలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పా ట్లు చేయాలని, ప్రభుత్వం సన్నరకం వరికి రూ.500 బోనస్ ప్రకటించిందని, పండించిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. అర్హత ఉన్న వారందరికీ రూ.500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్ అందేలా పౌరసరఫరాల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 14 రకాల యూనిట్ల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధిపొందేలా అమలు చేయాలన్నారు. సర్పంచ్‌లు లేనందున ప్రత్యేకాధికారులు చొరవ తీసుకొని అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని దవాఖానలో అవసరమైనంత మేరకు డయాలసిస్ బెడ్స్ పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్య తోపాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అం దించాలన్నారు. సెట్విన్ ద్వారా యువత, మహిళలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలన్నారు. ఆరుగ్యారెంటీలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ స్థాయిలో సాధ్యమయ్యే పనులను వెంటనే చేపట్టి పూర్తిచేయాలని, సమావేశంలో చర్చించిన మిగతా పనుల ప్రతిపాదనలు అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిషరించాలన్నారు. భవిష్యత్‌లో సిద్దిపేట జిల్లా అభివృద్ధిపై రెండు, మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసుకుందామన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు విడుదల కాలేదని.. త్వరలోనే వస్తాయన్నారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఫ్యామిలీకి ఒక కార్డు ఇచ్చేందుకు ప్రభుత్వం త్వరలోనే శ్రీకారం చుట్టబోతోందన్నారు.

**సమీక్షకు పొన్నం ప్రభాకర్ డుమ్మా..**

## దేవాదాయశాఖల మంత్రి కొండా

సిద్దిపేట జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశానికి రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గైర్హాజరయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ హాజరయ్యారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కాలేదు.

**దవాఖానల్లో సరైన సౌకర్యాలు లేవు**

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రూ.2లక్షలపైన రుణం ఉన్న రైతులకు సంబంధించి సరైన మార్గదర్శకాలు ఇవ్వాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఫసల్ బీమా యోజన పథకంలో చాలా ఇబ్బందులు ఉన్నందున..రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏదైనా ప్రత్యామ్నాయం ఆలోచించిందా అని అడిగారు. చేర్యాలలోని ప్రభుత్వ దవాఖాన ల్లో సరైన వైద్యులతో పాటు మందులు లేవన్నా రు. చేర్యాల మీదుగా నిర్మాణమవుతున్న రహదారి వెంట మొక్కలు నా టాలన్నారు. కొత్తగా పట్టా పుస్తకాలు పొం దిన రైతులందరికీ రైతుబీమా వర్తింపచేయాలన్నారు. విద్యుదాఘాతంతో లైన్‌మెన్ చనిపోతే ఎందుకు స్పందించలేదని అధికారులను ప్రశ్నించారు. బతుకమ్మ పండుగకు గ్రామాల్లోని స్తంభాలకు లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. గ్యాస్ సబ్సిడీ అందరికీ రావడం లేదు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మహాలక్ష్మీ పథకంలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యాస్ సబ్సిడీ అందరికీ రావడంలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సన్నవడ్లు పండించే రైతుల సంఖ్య అధికారుల వద్ద ఉందా..రూ.500 బోనస్ సన్న వడ్లకు ఇస్తారా.. దొడ్డు వడ్లకు ఇస్తారా అని అడిగారు. దుబ్బాకలోని 100 పడకల దవాఖానలో సరైన సదుపాయాలు లేవని వెంటనే ఆ సమస్య పరిష్కరించాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయు లుంటే విద్యార్థులు లేరని, మరో పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉంటే ఉపాధ్యాయులు లేరన్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఆర్అండ్‌బీకి సంబంధించి మంజూరైన రోడ్లను రద్దు చేశారని..వాటిని మళ్లీ మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలని ఆయన మంత్రి, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కేంద్రమంత్రితో చర్చిస్తాం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో ఉన్న సమస్యలపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రితో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. జిల్లాలో మూడు పెద్ద రిజర్వాయర్లు ఉన్నాయని.. వాటి పరిధిలో సొసైటీలు ఏర్పాటు చేయాలన్నారు. చేపలు పట్టుకునేందుకు తొగుట మండలం తుక్కాపూర్ గ్రామస్తులకు అవకాశం కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నుంచి డీజిల్ తయా రు చేసే యూనిట్‌కు ప్రోత్సాహం అందించాలన్నారు. పండుగల కోసం గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు.

# ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం సున్నా



**జహీరాబాద్‌–నవభూమి :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం కొత్తూర్(బి) నారింజ వాగు ప్రాజెక్టు నిండుకుండలా మారింది. కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జహీరాబాద్, న్యాల్‌కల్, కోహీర్, ఝరాసంగం మండలాల పరిధిలోని వాగులు, వంకలు, చెక్‌డ్యామ్‌ల ద్వారా వరద నీరు భారీగా తరలివస్తున్నది. దీం తో ఇరిగేషన్ అధికారులు ఒక గేటు కొంత మేరకు ఎత్తడంతో పాటు ప్రాజెక్టు గేట్ల మీదుగా వరద కర్ణాటక వైపు తరలివెళ్తున్నది. జహీరాబాద్ ప్రాంతంలోనే పుట్టిన నారింజ ప్రాజెక్టు జలాలను ఇక్కడి రైతులు ఉపయోగించుకుంటున్నది మాత్రం చాలా తక్కువ. వృథాగా కర్ణాటక ప్రాంతానికి తరలివెళ్తున్న జలాలను కొంతమేర సద్వినియోగం చేసుకునేందుకు జహీరాబాద్ మం డలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో నారింజ వాగుపై 1970లో అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించింది. 1971లో ప్రాజెక్టు కింద 15 కిలోమీటర్ల దూరం కుడి, ఎడమ కాల్వలను తవ్వించి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు కింద న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాల పరిధిలోని 3,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయినప్పటికీ ఏ కాల్వ సాగుకు అనువుగా లేకుండా పోయింది. దీంతో గ్రామా ల్లో గుంట భూమికి సాగునీరు పారిన దాఖలాలు లేవు. ఈ ప్రాజెక్టు నీటి సామర్థ్యం 85 మిలియన్ క్యూబిక్ ఫీట్లు. గత ప్రభుత్వాలు చేపట్టిన జన్మభూమి, జలయజ్ఞం, మిషన్ కాకతీయ ఫథకాలు కూడా ప్రాజెక్టు దశను మార్చలేకపోయాయి. దీంతో ఏటా వర్షాకాలం ప్రారంభంలోనే ప్రాజెక్టు వరద నీటితో నిండి గేట్లపై నుంచి నీరు వృథాగా కర్ణాటక వైపు వెళ్తున్నది. ఈ నీరు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని కరింజ ప్రాజెక్టులోకి చేరుతుంది. అక్క డి రైతుల సాగుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. 2012లో అప్పటి ప్రభుత్వం రూ.5.77 కోట్లతో ప్రాజెక్టు షెటర్లు, కట్ట మరమ్మతులు చేయించింది. 2015లో ప్రాజెక్టు కింద ఆయకట్టుకు నీరందించేందుకు కుడి,ఎడమ కాల్వల మరమ్మతు పనులు అసంపూర్తిగా చేపట్టి వదిలేశారు. మూడేండ్ల క్రితం రూ.18 లక్షలు ఖర్చుచేసి ప్రాజెక్టులో నామమాత్రంగా పూడికతీత పనులు చేశారు. పాలకులు, అధికారులు ప్రాజెక్టును పట్టించుకోకపోవడం, కాల్వల నిర్మాణం తదితర మరమ్మతు పనులు చేపట్టకపోవడం వల్ల ఈ ప్రాంత రైతులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోతున్నది. ప్రేటా ప్రాజెక్టులోకి వరద రావడం..వృథాగా కర్ణాటక వైపు వెళ్లిపోతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. దశాబ్దాలుగా ప్రాజె క్టు కింద ఆయకట్టు సాగుకు నోచుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# ఈ పనిభారం మోయలేం

## రైతుల సమస్యలు పరిష్కరించాలి



**మునిపల్లి-నవభూమి :** రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. బుధవారం మునిపల్లిలోని తహసీల్ కార్యాల యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆదర్శ పాఠశాలతోపాటు బుధేరా మహిళా డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు.తహసీల్ కార్యాలయం లో ఎల్ఆర్ఎస్, రికార్డు గదులు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీకి వచ్చిన రోగులతో మాట్లాడారు. మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆశాజ్యోతి, ఎంపీడీవో హరినందన్‌రావు, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## దాడులు, కేసులపై డీజీపీని కలుస్తా: ఎమ్మెల్యే పల్లా



**చేర్యాల-నవభూమి :** నియోజకవర్గంలో ప్రజలు, బీఆర్ఎస్ నా యకులపై రోజురోజుకూ దాడులు, అక్రమ కేసులు పెరుగుతున్నాయ ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల వినాయక నవరాత్రుల ముగింపు రోజు బీఆర్ఎస్ యువజన నాయకులు అవుశెర్ల కిశోర్, అవుశెర్ల వెంకటేశ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడిచేయడంతో వారు తీవ్రం గా గాయపడగా బుధవారం వారిని పరామర్శించారు. అనంతరం చేర్యాల ఎస్సై నీరేశ్ తో ఫోన్‌లో మాట్లాడారు.బీఆర్ఎస్ యువజన నాయకులపై దాడికి దిగిన వారిపై కేసు నమోదు చేయకుండా క్షతగాత్రులు, దాడికి గురైన వారిపై కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పోలీసులు బాధితులకు న్యాయం చేయకపోయినా అన్యాయం చేయవద్దని సూచించారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్‌ను గమనిస్తున్నామని, ప్రతి విషయాన్ని రికార్డు చేస్తున్నామని, దీనిపై త్వరలో పోలీస్ ఉన్నతాధికారులతోపాటు డీజీపీని కలిసి నివేదిక అందజేస్తానన్నారు.అనంతరం చేర్యాలలో కొనసాగుతున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్‌లో ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, టౌన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మాజీ ఎం పీపీ మేడిశెట్టి శ్రీధర్, ముస్త్యాల బాల్‌నర్స య్య, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, పెడుతల ఎల్లారెడ్డి, శివగారి అంజయ్య, జింకల పర్వతా లు, వడ్లకొండ శ్రీనివాస్, అరిగే కనకయ్య, సూటిపల్లి బుచ్చిరెడ్డి, తిరుపతిగౌడ్ ఉన్నారు.

## సమయపాలన పాటించవు ఉంటే చర్యలు తప్పవు



**కౌడిపల్లి-నవభూమి :** ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఈఓ బాల్ రాజ్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం ఎంఈఓ గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని అన్నారు. బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలించేందుకు ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండే విధంగా చూడాలని ఆయన సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠ్యాంశాలు బోధించాలని తెలిపారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎంఈఓ ను వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు శాలువాతో సన్మానించారు

# ఈ పనిభారం మోయలేం



**సంగారెడ్డి(నవభూమి :** కాంగ్రెస్ సర్కార్ వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిపై ప్రభుత్వం రోజురోజుకూ పని ఒత్తిడి పెంచుతున్నది. దీంతో ప్రభుత్వంపై క్షేత్రస్థాయి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులకు ఆర్థిక సహాయం తదితర హామీలను ఇచ్చింది.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పంటరుణమాఫీ, రైతుభరోసా, కౌలు రైతులకు ఆర్థిక సహా యం తదిరత హామీలను నిలబెట్టుకోవడం లేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అవసరమైన నిధులు లేకపోవడంతో పథకాల అమలుకు కొర్రీలు పెడుతూ మెజార్టీ రైతులను జాబితాల నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నది. ఇందుకోసం అర్హులైన రైతులను గుర్తించేందుకు క్షేత్రస్థాయి వ్యవసాయశాఖ అధికారులు సిబ్బందితో సర్వేలు చేపడుతున్నారు. జిల్లాలో ఇది వరకే అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు(ఏఈవో)లు పంట రుణమాఫీకి సం బంధించి గ్రామాల్లో పర్యటిస్తూ రైతుల వివరాలు సేకరిస్తున్నారు.ప్రతి రైతు కుటుంబం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేస్తూ రైతు కుటుంబాల ఫొటోలు తీసుకుని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. రైతుబీమా, పీఎంకిసాన్, పంటనమోదు, పంటనష్టం సర్వే పనులను ఏఈవోలు నిర్వహిస్తున్నారు. వీటితో పాటు రైతునేస్తం, పంటకోత ప్రయోగాలు తదితర కార్యక్రమాలను ఏఈవోలు నిర్వహిస్తున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోలకు 'డిజిటల్ క్రాప్ సర్వే' పనులను అప్పగించింది. గ్రామాల్లోని రైతు లు ఎంత విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తున్నారు, ఏ రకాల పంటలు సాగు చేస్తున్నారు తదితర వివరాలను ఏఈవోలు సేకరించడంతో పాటు పంటల ఫొటోలను తీసి ఆన్‌లైన్ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది.ఇందుకోసం ఏఈవోలు తప్పనిసరిగా సర్వేనెంబరు, రైతువారీగా పంటల సాగు వివరాలను నమోదు చేయాలి. జిల్లాలో ప్రస్తుతం 116 మంది ఏఈవోలు పని చేస్తున్నారు. వీరిలో 58 మంది మహిళా అధికారులు ఉన్నారు. ప్రతి ఏఈవో పరిధిలో 10వేల నుంచి 6500ఎకరాల వరకు సాగుభూములు ఉన్నాయి. గ్రామంలోని పొలాలకు వద్దకు వెళ్లి క్రాప్ డిజిటల్ సర్వే పూర్తి చేయాలంటే తీవ్ర పనిఒత్తిడి పెరుగుతుందని, వర్షాకాలంలో పంట పొలాల్లోకి వెళ్లడం కష్టంగా మారిందని ఏఈవోలు చెబుతున్నారు.ప్రతి పొలం వద్దకు వెళ్లి వివరాలు సేకరించాలంటే ఇబ్బంది పడాల్సి వస్తుందని మహిళా ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే పని ఒత్తిడిలో ఉన్న తమ పై మరింత పనిభారం మోపవద్దని, క్రాప్ డిజిటల్ సర్వే బాధ్యతల నుంచి తమను తప్పించాలని ఏఈవోలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్(వీఏఏ)లను నియమించి వారికి క్రాప్ డిజిటల్ సర్వే బాధ్యతలు అప్పగించాలని ఏఈవోలు డిమాండ్ చేస్తున్నారు.

# మైనంపల్లి భాష మార్చుకో



**నర్సాపూర్-నవభూమి :** మైనంపల్లి హన్మంతరావు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై వాడిన భాషను మార్చుకోవాలని మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ హెచ్చరించారు. బుధవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనంపల్లి హన్మంతరావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మాజీ ఆత్మకమిటీ చైర్మన్ శివకుమా ర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మంత్రిపదవి ఇవ్వడం కాదు.. ముందు నువ్వు మంత్రి పదవి తెచ్చుకోవాలని ఎద్దేవా చేశారు.సభ్యత, సంస్కారం లేకుండా వ్యక్తిగతంగా దూషించడం సరైన పద్ధతి కాదన్నారు. గోమారంలో మాజీ మంత్రి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇం టిపై కాంగ్రెస్ నాయకులు, గూండాలు అన్యాయం గా, అకారణంగా దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న మాజీమంత్రి హరీశ్‌రావు ఎమ్మెల్యే సునీతారెడ్డిని పరామర్శించడానికి, మనోధైర్యాన్ని చెప్పడానికి వెళ్తే దీనిని మైనంపల్లి రాజకీయం చేస్తూ హరీశ్‌రావు ఎందుకు వచ్చావ్ అనడం సమంజసం కాదన్నారు.అలాంటప్పుడు నర్సాపూర్ వచ్చి నువ్వు ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టావని, నీపై, మీ కార్యకర్తలపై ఏమైనా దాడి జరిగిందా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న నర్సాపూర్ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని హెచ్చరించారు. మైనంపల్లి మాటలను నియోజకవర్గ ప్రజలు ఛీదరించుకుంటున్నారని మండిపడ్డారు. హామీలు నెరవేర్చడంలో, అభివృద్ధి పనులు చేయడంలో మీ పనితనాన్ని చూపించాలని సవాల్ విసిరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రె స్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నా రు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సత్యంగౌడ్, కౌడిపల్లి మండల అధ్యక్షుడు రామాగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి



**బెజ్జంకి-నవభూమి :** అర్హులైన రైతులందరికి వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం మండల పరిధిలోని తోటపల్లి ఇండియన్ బ్యాంకు వద్ద రూ.2 లక్షల రుణమాఫీ వర్తించని రైతులు చేపట్టిన ఆందోళనలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి బీజేపీ శ్రేణులతో కలిసి రైతుల రుణమాఫీ సమస్యను బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మాట్లాడారు.అర్హులైన రైతులకు రుణమాఫీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తోందని పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులకు రుణమాఫీ చేయాలని లేనిపక్షంలో బీజేపీ అధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని పెద్దిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.అంతకుముందు గ్రామంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొలిపాక రాజు అధ్వర్యంలో ఏర్పాటుచేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ మంత్రి ఇనుగాల పద్దిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి అనిల్ రావు,మండల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామ మంచినీటి సహాయకుల శిక్షణతో త్వరితగతిన సమస్యల పరిష్కారం



**పటాన్‌చెరు-నవభూమి :** గ్రామ మంచినీటి సహాయకులకు గ్రామాలలో పరితగతిన సమస్యలు పరిష్కారం అవుతాయని మిషన్ భగీరథ ఎస్సీ ఎన్ రఘువీర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన గ్రామ మంచినీటి సహాయకుల నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మిషన్ భగీరథ ఎస్సి రఘువీర్ మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా చిన్న చిన్న సమస్యలు తలెత్తిన ప్పుడు మంచినీటి సహాయకులే మరమ్మత్తులు చేసుకునే విధంగా ఈ శిక్షణ ఎంతో తోడ్పడుతున్నట్లు చెప్పారు. నాలుగు రోజులపాటు ఇచ్చే ఈ శిక్షణ తరగతుల మొదటి రోజు హ్యాండ్ పంప్స్ రెండవ రోజు వాటర్ క్వాలిటీ, మూడవరోజు పైప్లైన్ డీకేజీ అరికట్టడం, నాలుగో రోజు వాటర్ పంప్ సెట్ లపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. పటాన్ చెరు నియోజకవర్గంలో చిన్న గ్రామా పంచాయితీ లో ఒక్కరు, పెద్ద గ్రామా పంచాయతీలో ముగ్గురు చొప్పున 615 మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలియజేశారు. ఈ శిక్షణ తరగతుల వల్ల చిన్నచిన్న మరమ్మత్తులు చేసుకోవటం, నీటి నాణ్యత, కరెంటు ఓల్టేజీ, సమస్యలు పరిష్కారం అవడంతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా చేయటానికి వీలు పడుతున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈ ఈ షేక్ పాషా, డిఈలు శ్రీనివాస్, సుచరిత, ఎంపీడీవో యాదగిరి, ఎంపీ ఓ హరి శంకర్ గౌడ్ గ్రామ మంచినీటి సరఫరా సహాయకులు తదితరులు పాల్గొన్నారు

# సంఘానికి కుర్చీలు టెంట్ అందజేత..



**బెజ్జంకి-నవభూమి :** మండల పరధిలోని గూడెం గ్రామానికి చెందిన మొదుంపల్లి రాజు,సంపత్ కుమార్ వారి తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం సుమారు 20 వేల విలువైన కుర్చీలు,టెంట్ స్థానిక అంబేడ్కర్ యువజన సంఘానికి అందజేసినట్టు బుధవారం భూపెందర్ తెలిపారు. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్వర్యంలో సహాయం అందజేసిన ఇరువురు కుమారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆక్రమణదారులకు నచ్చజెప్పండి

**ఇబ్రహీంపట్నం-నవభూమి :** 'మూసీ ప్రక్షాళనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.. ఇండ్లు కోల్పోయే ఆక్రమణదారులకు నచ్చజెప్పండి..'.. అని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. బుధవారం రాజేంద్రనగర్ మండల రెవెన్యూ కార్యాలయంలోని మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి, అక్రమ నిర్మాణాల తొలగింపుపై సంబంధిత అధికారులతో రంగారెడ్డి కలెక్టర్ శశాంక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లు కోల్పోయే పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయించేందుకు అర్హుల వివరాలను సేకరించాలన్నారు. జిల్లాలోని గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో 332 అక్రమ నిర్మాణాలను గుర్తించామన్నారు. ఈ నిర్మాణాలను తొలగించాల్సి ఉన్నందున వారికి మరోచోట డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

# భూనిర్వాసితులకు అండగా ఉండాలి



**సిద్దిపేట-నవభూమి :** 'జిల్లాలోని రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించాలి. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కొండ పోచమ్మసాగర్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ కింద భూ నిర్వాసితులకు చేపలు పట్టుకునే అవకాశం ఉంటుంది' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట జిల్లా అభివృద్ధిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పలు అంశాలను లేవనెత్తి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురే ఖ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ%రా%సిద్దిపేట జిల్లాలో సగం అన్నపూర్ణ సాగర్ ఉంటుందని, అకడ సిరిసిల్ల జిల్లా నిర్వాసితులకు ఆ అవకాశాన్ని కల్పించాలన్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లో కూడా సిద్దిపేట జిల్లా నిర్వాసితులకు అవకాశం కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న చెరువులు, రిజర్వాయర్లలో ఎప్పటిలోగా చేప పిల్లల పంపిణీ జరుగుతుందో ఇప్పటివరకు అధికారులు స్పష్టత ఇవ్వలేదన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే ప్రక్రియ ను ఎప్పటిలోగా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. కొనుగోలు విషయంలో సమస్యలు తలెత్తకుండా సివిల్ సైప్లైశాఖ ఏమైనా చర్చలు జరుపుతుందా? లేదా అని అడిగారు.

**రెగ్యులర్ వ్యవసాయాధికారిని నియమించాలి**

జిల్లా అభివృద్ధిపై సమీక్షా సమావేశం కొన్ని నెలలుగా జరగడం లేదని హరీశ్‌రావు అన్నారు. కొండా సురేఖ సీనియర్ మంత్రిగా, శాసనసభ్యురాలిగా మీరు అభివృద్ధి కార్యక్రమాలకు తోడుగా ఉంటారనే నమ్మకం ఉందన్నారు. జిల్లాలో వ్యవసాయశాఖకు రెగ్యులర్ అధికారులు లేక ఆయిల్‌పామ్ సాగులో టార్గెట్ రీచ్ కాలేదన్నారు. పూర్తిస్థాయి వ్యవసాయాధికారిని నియమించాలని కోరారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారని, రైతు భరోసా గైడ్‌లైన్స్ విడుదల చేసి రైతుబంధు డబ్బులను వీలైనంత త్వరగా ఇప్పించాలని కోరారు. పీఎం కిసాన్ ప్రారంభించినప్పుడు జిల్లాలో 1.77 లక్షల మంది రైతులు లబ్ధిదారులుగా ఉంటే ఇప్పుడు 95 వేలకు తగ్గిందన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఈవిషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. పంట రుణమాఫీ విషయంలో 31 గైడ్‌లైన్స్ విధించడం వల్ల క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. రెండు లక్షల్లోపు పంట రుణమాఫీ కాని వాళ్లే 30 నుంచి 40శాతం మంది ఉం టారన్నారు. రెండు లక్షలపై ఉన్న డబ్బులు కట్టిన వారి కి ఇంకా రుణమాఫీ కాలేదని, ఈవిషయం పై కూడా స్పష్టత లేదన్నారు. వర్షాలకు కూరగాయలు, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఖమ్మం, మ హబూబాబాద్ జిల్లాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించినప్పుడు సిద్దిపేట జిల్లాలో జరిగిన పం టలకు నష్టపరిహారం ఇప్పించాలని మంత్రిని కోరారు.

**పెండిరేగ్ నిధులు విడుదల చేయాలి**

ఇక మేము పనిచేయలేకపోతున్నామని జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన పరిస్థితి వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. పంచాయతీ సెక్రటరీలు తమ సొంత జీతం నుంచి లక్ష నుంచి లక్షా యాభైవేల వరకు ఖర్చు చేశారన్నారు. పంచాయతీ సెక్రటరీలకు పెండింగ్ నిధులు విడుదల చేయాలన్నా రు. దసరా ఉత్సవాలు నిర్వహించేందుకు పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, స్టీల్ బ్యాంకులను మూసివేయకుండా ప్రోత్సహించే విధంగా చూడాలని కోరారు. సిద్దిపేటలో 250 హెక్టార్ల ఫారెస్ట్ పారును మరింత అభివృద్ధి చేయాలన్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు ఉన్న సుందరమైన అడవిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. సిద్దిపేట నర్సింగ్ కాలేజీలో సమస్యలు పరిష్కరించాలన్నారు. సిద్దిపేటలో 50 పడకల ఆయుష్ దవాఖాన పూర్తయిందని, దానిని ప్రారంభించాలన్నారు. ఆయుష్ దవాఖాన కోసం భూమి ఇచ్చిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు.

**పెండిరేగ్ వేతనాలు చెల్లించండి**

మోడల్ సూల్స్ కాంట్రాక్టు ఉపాధ్యాయుల వేతనా లు, కస్తూర్బా సూల్స్ మెస్‌బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేయాలని హరీశ్‌రావు కోరారు. మన ఊరు -మనబడి కింద 80శాతం పను లు పూర్తయ్యాయని, మిగతా పనులను పూర్తిచేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలన్నారు. ఆర్అండ్‌బీ కింద రెండు రోడ్లు రద్దు చేశారని, 50 శాతం పనులు పూర్తయిన నాలుగు రోడ్లను నిలిపివేశారన్నారు. మూడు రోడ్ల టెండర్లు పూర్తయినా పనులు ప్రారంభించలేదన్నారు. పంచాయతీరాజ్‌లో రూ. 45 కోట్ల విలువ చేసే 19 పనులను రద్దు చేశారని, రద్దు చేసిన పనులను తిరిగి ప్రారంభించాలన్నారు. జిల్లాలో పనులు ప్రారంభించిన పశు వైద్య కళాశాలను రద్దు చేశారని, తిరిగి ప్రారంభించాలని ఆయన కోరారు.

# మంత్రి పైరవీతోనే చర్యలు ఆగేనా

**రామాయంపేట-నవభూమి :** సాయి కృష్ణ హాస్పిటల్ వైద్యుల పొరపాటు వల్ల తల్లి బిడ్డలు మృతి చెందిన కేసులో, హాస్పిటల్ యాజమాన్యం సామాజిక వర్గానికి చెందిన ఓ మంత్రితో పైరవి చేయడం వల్ల నాలుగు నెలలు అయినా నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రచారం సాగుతుంది. సామాన్యులను చిన్నచిన్న తప్పులకు జైళ్ళ పాలు చేసే మన చట్టాలు.. ప్రాణాలు పోయేందుకు కారణమైనా సరే.. ఆర్థిక బలం, రాజకీయ పలుకుబడి ఉంటే చాలు.. మన చట్టాలు వారికి చుట్టాలుగా మారిపోతున్నాయి. ప్రసవానికి ఓ ప్రైవేటు హాస్పిటల్ కి వచ్చిన మహిళకు, అధిక మోతాదులో మందులు ఇచ్చి, దాంతో తీవ్ర రక్తస్రావం అవుతున్న ఆమెను, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా హైదరాబాద్ కు పంపడంతో ఆమె ప్రాణాలు కోల్పోయిందని విచారణ అధికారులు తేల్చారు. విచారణ పూర్తి అయి నాలుగు నెలలు అవతున్న నేటి వరకు ఆ ఆసుపత్రి పై గాని, డాక్టర్లపై గాని ఎలాంటి చర్యలు లేవు.

**డాక్టర్ పొరపాటు వల్లే బాలింత మృతి..**

ఈ సంవత్సరం మే 17న రామాయంపేట పట్టణానికి చెందిన ఎస్తేర్ (23) అనే మహిళ, పట్టణంలోని సాయి కృష్ణ హాస్పిటల్ లో ప్రసవానికి వచ్చి తల్లి బిడ్డలు మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఈ విషయమై నవతెలంగాణలో వచ్చిన కథనంతో పాటు, మృతురాలి కుటుంబ సభ్యులు




జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కలెక్టర్ విచారణ నిమిత్తం ప్రత్యేక వైద్య బృందాన్ని నియమించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ నేతృత్వంలోని ప్రత్యేక వైద్య బృందం జూన్ 11న సాయి కృష్ణ హాస్పిటల్ లో విచారణ జరిపారు. ఈ విచారణలో ఆసుపత్రి డాక్టర్ల నిర్లక్ష్యంతో పాటు, పొరపాట్లు వెలుగులోకి వచ్చాయి. జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్తేర్ కు కడుపులో మృతి చెందిన బిడ్డను బయటకు తీయడానికి అధిక మోతాదులో మందులు ఇవ్వడంతోనే తీవ్ర రక్తస్రావం జరిగింది. తీవ్ర రక్తస్రావం జరుగుతుండగా, అర్హత గల డాక్టర్ నేతృత్వంలో గాని, స్టాఫ్ నర్స్ ల ఆధ్వర్యంలో ఆమెకు రక్తాన్ని ఎక్కిస్తూ హైదరాబాద్ ఆసుపత్రికి పంపాల్సింది. అలా చేస్తే ప్రాణాన్ని కాపాడగలిగే వారు. అలా చేయకుండా ఓ కాంపౌండర్ తో అంబులెన్స్ లో ఎలాంటి రక్తం సపోర్టు లేకుండా పంపించారు. 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాద్ కాకుండా, బ్లడ్ బ్యాంక్ అందుబాటులో ఉన్న 20 కిలోమీటర్ల దూరంలోని మెదక్ పంపి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదేమో. ఇలా తప్పు మీద తప్పు చేయకపోతే ప్రాణం దక్కేదేమో అని జిల్లా వైద్యాధికారి విచారణలో విలేకరులకు తెలిపారు.

జిల్లా కలెక్టర్ కు నివేదిక అందజేశాం %-% జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ నాలుగు నెలలైన సాయి కృష్ణ హాస్పిటల్ పై చర్యలు తీసుకోకపోవడం పై జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ వివరణ కోరగా.. వైద్యుల పొరపాటు జరిగింది నిజమేనని, పూర్తి నివేదిక జిల్లా కలెక్టర్ కు అందజేశామని తెలిపారు. తదుపరి చర్యలు జిల్లా కలెక్టర్ తీసుకోవాల్సి ఉందన్నారు

## మాలమహానాడు నూతన కార్యవర్గ ఎన్నిక..



**బెజ్జంకి-నవభూమి** : మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామ మాలమహానాడు నూతన కమిటీ కార్యవర్గ ఎన్నిక నిర్వహించినట్టు మండలాధ్యక్షుడు ర్యాకం రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నూతన గ్రామాధ్యక్షుడిగా మైల శ్రీకాంత్,ఉపాధ్యక్షులుగా గడ్డం సుధాకర్,పబ్బతి బాబు,ప్రధాన కార్యదర్శిగా పబ్బతి శ్రీనివాస్,సంయుక్త కార్యదర్శులుగా బిట్ల మల్లేష్,బోలుమల్ల రాజు కోశాధికారిగా గడ్డం శ్రీధర్,కార్యవర్గ సభ్యుల ఎన్నికైనట్టు ర్యాకం రాజు పేర్కొన్నారు.మండల కమిటీలోకి..కల్లేపల్లి గ్రామానికి చెందిన పబ్బ తి రమేష్,పబ్బతి రాజు, సోషల్ మీడియా సెక్రెటరీ మీసాల రమేష్ లను మాలమహానాడు మండల కమిటీలోకి నూతన కార్యవర్గ సభ్యులుగా నియామకం చేశామని రాజు తెలిపారు.

## దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



**తొగుట-నవభూమి :** దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ను బుధవా రం కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించి చూపాలి

**యాదగిరిగుట్ట-నవభూమి :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత మూడేండ్ల కాలంలో రాష్ట్రంలో 3 లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించే విధంగా చర్యలు తీసుకున్నారని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ ఆ స్థాయిలో రెట్టింపు పంటలు పండించి చూపిస్తే పాలాభిషేకం చేస్తామని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సవాల్ విసిరారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామిని బుధవారం ఆయన కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి ఆలయ సంప్రదాయరీతిలో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం మల్లారెడ్డి మీడియాతో మాట్లాడారు. దేశానికే అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్ తీసుకువచ్చారని, ప్రపంచమే గర్వపడే విధంగా యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారని అన్నారు. రైతు బంధు, రైతు బీమా ఇవ్వకుండా దాటవేసే ధోరణిలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే గ్రూపుల పార్టీగా అభివర్ణించారు.



### కాంగ్రెస్ పార్టీని విమర్శించే

# నైతిక హక్కు కొత్తకు లేదు



**దుబ్బాక-నవభూమి :** దుబ్బాక కు మొట్టమొదటి శత్రువులు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డిలేనని, బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ళ ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్ రెడ్డి దుబ్బాకకు చేసింది ఏమి లేదని, ఎమ్మెల్యే గా గెలిచి 10 నెలలు గడుస్తున్న దుబ్బాక నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకున్న పాపానపోలేదు.తాజాగా కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు జిర్ణించుకోలేక బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బతుకమ్మ సంబరాల పేరుతో నాలుగు సంవత్సరాలుగా మున్సిపాలిటీలో అనేక అవినీతి అక్రమాలకు దొంగ బిల్లులు పెట్టకపోతే గత కమిషనర్ గణేష్ రెడ్డి పై దుబ్బాక ఎమ్మెల్యే దాడి చేయించి,అవినీతిని పెంచి పోషించారని,కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు కొత్తకు లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల దేవేందర్ అన్నారు.బుధవారం సీఎస్ఆర్ దుబ్బాక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యే మున్సిపాలిటీలో కాగితాల పైననే 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించాడని, ఆయన అండతో అనేక అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బతుకమ్మ సంబరాలు,హరితహారం పేరుతో చైర్మన్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని. అన్నారు. అవినీతి బిల్లులు మంజూరు చేయకపోతే కమిషనర్ పైన ఎమ్మెల్యే దాడి చేయించారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులు కేటాయించడం లేదని కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. మీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రఘునందన్ రావు పై వివక్ష చూపలేదని ఆయన ప్రశ్నించారు. దుబ్బాక కు మొట్టమొదటి శత్రువు హరీష్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి లేనని వారు ఆరోపించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి కి నిజంగా దుబ్బాక మున్సిపాలిటీ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే దుబ్బాక మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపైన విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన 10 మాసాల అవుతున్న దుబ్బాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల సమస్యలపై దరఖాస్తులు తీసుకున్నవా అని ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి,దుబ్బాక మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన ఘన చరిత్ర మాజీ మంత్రి, స్వర్గీయ ఎమ్మెల్యే చెరుకు ముత్యం రెడ్డి గారిదేనని కొనియాడారు. కోడి కత్తి,మద్యం ,డబ్బులు పంచిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీని, దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా నాయకులు మల్లు గారి చంద్రారెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉషయ్య గారి రాజిరెడ్డి, మున్సిపాలిటీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, తోట్ల. చెంద్రం తదితరులు ఉన్నారు.

# అవినీతి, అరాచకాలను ఎండగడుదాం



**నల్లగొండ-నవభూమి** : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ వైఫల్యాలు, మంత్రుల వ్యవహార శైలి, అవినీతి, అరాచకాలు, ప్రజల్లో వ్యతిరేకతపై పోరాటాలతోపాటు బీఆర్ఎస్ కేడర్‌లో జోష్ నింపే దిశగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి నివాసంలో జరిగిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల్లో జరుగుతున్న చర్చ, వ్యతిరేకత, పార్టీ పరిస్థితి, చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపైనా విస్తృతంగా చర్చించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో జిల్లా ముఖ్య నేతలంతా తాజా పరిస్థితిని కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నల్లగొండ జిల్లాలో తిరిగి మళ్లీ ఫ్లోరైడ్ ఆనవాళ్లు తెరపైకి వచ్చాయని కేటీఆర్‌కు వివరించారు. జిల్లాలో కాంగ్రెస్ నేతల అవినీతి, అరాచకాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నదని, ముఖ్యంగా మంత్రుల సపోర్ట్‌తో అధికార పార్టీ నేతలు ప్రజలను ఏ విధంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారో నియోజకవర్గాల వారీగా వివరించారు. జిల్లాలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్డగోలుగా వ్యవహరిస్తుండడంతో ప్రజల్లోనూ వ్యతిరేకత మొదలైందని చెప్పారు.

**త్వరలో క్షేత్రస్థాయి పర్యటనలు**

జిల్లా నేతల నుంచి వివరాల సేకరణ అనంతరం కేటీఆర్ స్పందిస్తూ మంత్రుల అవినీతి, అరాచకాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు. అధికార దర్పం, అహంకారంతో మంత్రులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నట్లు విమర్శించారు. మంత్రులతోపాటు కాంగ్రెస్ నేతల అక్రమాలను, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతోపాటు జిల్లాకు సంబంధించిన స్థానిక అంశాలపైనా మరింత చురుగ్గా ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధం కావాలని కేటీఆర్ సూచించారు. ఇంకా జిల్లా పరిధిలో ప్రభుత్వాన్ని నిలదీసే అంశాలపైనా పార్టీ నేతలతో కేటీఆర్ చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై త్వరలోనే జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజలకు వివరిద్దామని నిర్ణయించారు.

**బీఆర్ఎస్ బలోపేతంపైనా**

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపైనా నేతలతో కేటీఆర్ విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు, ముందుకు తీసుకువెళ్లాల్సిన అంశాలపైనా కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పార్టీ క్యాడర్‌కు భరోసానిస్తూ మరింత బలోపేతం చేసేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రానున్న కాలంలో ప్రభుత్వంపై ప్రజల్లో మరింత వ్యతిరేకత రావడం ఖాయమని, అందుకు అనుగుణంగా పార్టీ కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన భేటీలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, నల్లమోతు భాసర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ జడ్పీ చైర్మన్లు బండ నరేందర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సోమ భరత్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి, నంద్యాల దయాకర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# అన్నదాత ఆశలకు 'గండి'

**కోదాడ-నవభూమి :** అప్పుసొప్పు వేల రూపాయలు పెట్టుబడి వరి సాగు చేస్తే ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటంతా ఊడ్చుకుపోయింది. నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురంలో సాగర్ ఎడమ కాల్వకు ఈ నెల ఒకటిన పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చకపోవడంతో రైతులకు అపార నష్టం జరిగింది. వర్షం, వరద కారణంగా రైతులను నష్టపోయిన దానికి మించి.. మరమ్మతుల కోసం సాగర్ కాల్వలకు నీటి విడుదల బంద్ చేయడంతో కోదాడ నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ నెల ఒకటిన గండి పడితే 14వరకు కూడా మరమ్మతుల పనుల ప్రారంభం కాలేదు. ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు నీటి విడుదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

**మునక పంట నష్టం 4,909 ఎకరాలు.**

కోదాడ నియోజకవర్గంలో ఇటీవలి భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాన్ని వ్యవసాయాధికారులు సర్వే ద్వారా గుర్తించారు. అనంతగిరి మండలంలో 1,186 ఎకరాలు, చిలుకూరులో 905, కోదాడలో 1151, మోతెలో 1045, మునగాలలో 611, నడిగూడెం మండలంలో 201 ఎకరాల్లో మునకకు గురైనట్లు పేర్కొన్నారు. కాగా, సాగర్ కాల్వకు పడిన గండిని సకాలంలో పూడ్చకపోవడంతో ఎండిన పంటలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మరమ్మతుల ప్రారంభానికి రెండు వారాలు జాప్యం చేశారని, ఇప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీరు వదిలినా ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని వాపోతున్నారు. కనీసం పెట్టుబడి వెళ్లే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిన పంటలకు నష్టపరిహారంపై ప్రభుత్వం స్పందించకపోవడం మీద తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంతోనే తమకు ఈ పరిస్థితి ఏర్పడిందని, అందుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.



**ఎండిన ప్రతి ఎకరాకూ నష్టపరిహారం చెల్లించాలి**

ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతోనే సాగర్ ఎడమ కాల్వ పడింది. గండిని సకాలంలో పూడ్చకపోవడంతో నీళ్లు అందక నియోజకవర్గవ్యాప్తంగా వేల ఎకరాల్లో పంట ఎండింది. మునిగిన పంటకు ప్రభుత్వమే బాధ్యత వహించి, రైతులు నష్టపోయిన ప్రతి ఎకరూ పరిహారం చెల్లించాలి.

**వెంటనే నీళ్లు వదిలితే పొలాలు ఎండిపోయేవి కావు**

20 రోజులుగా సాగర్ ఎడమ కాల్వకు నీళ్లు రాకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. నాకున్న నాలుగు ఎకరాలతోపాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేశాను. ఇటీవల భారీ వర్షాల కారణంగా సాగర్ ఎడమ కాల్వకు గండి పడడంతో నీళ్లు నిలిపివేశారు. దాంతో నా పొలం నీరు లేక ఎండిపోయింది. కాల్వకు వెంటనే మరమ్మతులు చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. ఎండిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

## 40 వేల ఇండ్లు మటాష్.. మూసీపైకి రానున్న హైడ్రా బుల్డోజర్లు





**సిటీబ్యూరో-నవభూమి :** మా ఇండ్ల జోలికొస్తే ఖబడ్దార్ 'ప్రాణాలైనా ఇస్తాం..హైడ్రా బుల్డోజర్లను రానివ్వం. మాకు డబుల్ బెడ్రూంలు అవసరం లేదు. రూపాయి రూపాయి పోగు చేసుకొని ఇల్లు కట్టుకున్నాం. మూసీ వెంట ఉన్నది అందరం లేబర్లమే. మమ్మల్నీ తీసుకొని ఎక్కడో వేస్తే ఏం చేసుకొని బతకాలే. డబుల్ బెడ్రూం అందజేసే ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుంది. అంతవరకు మేము ఎక్కడ ఉండాలి. ఎలా బతకాలి'.. అంటూ.. మూసీ పరీవాహక ప్రాంత వాసులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇన్నేండ్లలో ఎప్పుడు ఇలాంటి మనసులేని సీఎంను చూడలేదని వాపోతున్నారు. రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే రోజులు వస్తాయని హెచ్చరిస్తున్నారు.మొదలైన అలజడి మూసీ పరీవాహక ప్రాంతాల్లో అలజడి మొదలైంది. పెద్ద ఎత్తున నివాసాలు ఉండటంతో వీటిని తొలిగిస్తే.. చాలా మంది రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని సామాజికవేత్తలు, మేధావులు ఆందోళన చెందుతున్నారు. పునరావాసం కల్పించడమంటే కేవలం నివాసం ఇస్తే సరిపోదని.. వారి ఆర్థిక స్థితిగతులను కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. పునరావాసం కల్పిస్తాం: దానకిశోర్ మూసీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 1600 నిర్మాణాలను సర్వే ద్వారా గుర్తించామని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ దానకిశోర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిర్మాణాలను తొలిగించడానికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఒక కార్యాచరణను రూపొందించామన్నారు. సుమారు 15వేల డబుల్ బెడ్రూం ఇండ్లను మూసీ రివర్ బెడ్, బఫర్ జోన్‌లో నివసిస్తున్న కుటుంబాల పునరావాసానికి కేటాయిస్తామని వివరించారు.

## చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

**దోమ-నవభూమి :** చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి, బాస్‌పల్లి గ్రామాల్లో వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, ఆర్గానిక్ పత్తి పంటను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో దృఢత్వం రావాలంటే పూర్వ కాలంలో సాగు చేసే చిరు ధాన్యాల వైపు రైతులు మొగ్గు చూపాలని తెలిపారు.సామలు, కొర్రలు, సజ్జలు, రాగులు, జొన్న తదితర పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈ పంటలు సాగు చేసే రైతులను ఆదుకునేలా జిల్లాస్థాయిలో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఆర్గానిక్ పద్ధతిలో వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకురావాలన్నారు. అనంతరం బాస్‌పల్లిలోని పాఠశాలలో మధ్యాహ్నభోజన శాలను, తాగునీటి సదుపాయాన్ని కలెక్టర్ పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో మహేశ్‌బాబు, మాజీ సర్పంచ్ యాదయ్య, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# సామూహిక సెలవుల్లో కార్యదర్శులు, ఎంపీఓలు, ఎంపీడీఓలు

**నల్లగొండ- నవభూమి :** ఇతర కారణాలతో ఉన్నతాధికారులు ఇబ్బందులు గురి చేస్తున్నారని కార్యదర్శులు సంచలన నిర్ణయానికి వచ్చారు. జిల్లాలోని గుర్రంపోడ్ ఎంపీడీఓ, మరో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవుకు వెళ్లారు. ఆ మేరకు బుధవారం జిల్లా అంతటా సెలవులు పెడుతూ సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు లేఖలు ఇచ్చారు. జిల్లాలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవి కాలం ముగిసిపోవడంతో పల్లెల్లో పరిపాలన సౌలభ్యం కోసం ఇతర శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. అంతేగాక క్షేత్రస్థాయిలో పనులు సక్రమంగా జరిగేందుకు, వాటిని తనిఖీలు చేసేందుకు ఇతర శాఖలకు సంబంధించిన అధికారులను మండల సూపర్‌వైజరీ అధికారులను నియమించి ఎప్పటికప్పుడు పల్లెల్లో పాలనపై జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తున్నది. గ్రామాల్లో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీరు, మొక్కల పెంపకం, కంపోస్ట్ షెడ్ నిర్వహణ వంటి కారణాలను ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా జిల్లాలో క్షేత్రస్థాయి పాలన వ్యవహారాల్లో కీలకమైన గ్రామ, మండల పరిషత్ విభాగంలో 9 నెలలుగా నిధుల రాక అధికారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా కొంతమంది అధికారులు సొంత నిధులు వెచ్చించి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారంటూ గుర్రంపోడ్ ఎంపీడీఓ, విధులకు హాజరు కాని పులిచర్ల పంచాయతీ కార్యదర్శి, పారిశుధ్యం క్రిమిటోరియం సక్రమంగా లేదని వాచ్యాతండా కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు తమ పట్ల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులంతా బుధవారం నుంచి సామూహిక సెలవుల్లోకి వెళ్లారు. ఇందుకు సంబంధించి వేర్వేరుగా ఆయా సంఘాల జేఏసీల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు తమ సామూహిక సెలవుల వినతిపత్రాలను అందజేశారు. దాంతో జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో పాలన వ్యవస్థ స్తంభించింది. వర్షాలు పడుతున్న వేళ సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండగా జిల్లా ఉన్నతాధికారులు, పంచాయతీ విభాగం అధికారులకు మధ్య తలెత్తిన వివాదం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. కాగా, అప్పటికే వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం నుంచి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి మూడు రోజుల పాటు మహారాష్ట్ర పర్యటనలో ఉండడం గమనార్హం.సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శుల జేఏసీ నేతలుఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. అప్పటి నుంచి గ్రామపంచాయతీలకు నిధులు రాలేదని, అయినా నిర్వహణ తామే చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శుల జేఏసీ నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో తామే అప్పులు చేసి తాగునీటితో పాటు పారిశుధ్య చర్యలు, వీధిదీపాల నిర్వహణ చేపడుతున్నట్లు తెలిపారు. తమకు రావాల్సిన దబ్బులను తక్షణమే చెల్లించాలని కోరారు. బీఎల్ఓలు నిర్వర్తించాల్సిన విధులను సైతం తమతో చేయించడం సరికాదంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన హరితహారం మొక్కల లెక్కల వివరాలపై ఇప్పుడు ఆరా తీయడమంటే తమను బ్లాక్‌మెయిల్ చేయడమేనని చెప్తున్నారు. ఇలా పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ అకారణంగా సస్పెన్షన్ వేటు వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ బిల్లులతోపాటు పని ఒత్తిడి తగ్గించాలని, అకారణంగా సస్పెండ్ చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సామూహిక సెలవుల్లో వెళ్తున్నట్లు అన్ని మండలాల్లో ఎంపీడీఓలకు కార్యదర్శుల జేఏసీ లేఖలను అందజేసింది. ఇదే సమయంలో మండల పంచాయతీ అధికారులు సైతం నిధులు లేకున్నా సాధ్యమైంత వరకు ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తున్నామని, అయినా ఉన్నతాధికారులు వివిధ రకాలుగా ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ సామూహిక సెలవు పెట్టారు. తక్షణమే తమ విభాగంలో సస్పెన్షన్లను ఎత్తివేయాలని, తమపై ఇతర శాఖల అధికారుల పర్యవేక్షణను తొలగించాలని, నిధులు విడుదల చేస్తూ పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఎంపీడీఓ సంఘం ఆధ్వర్యంలోనూ సామూహిక సెలవు కోరుతూ కలెక్టర్‌కు లేఖ పంపించారు. గ్రామ పంచాయతీల్లో నిధుల లేమి, పని ఒత్తిడి, అకారణ సస్పెన్షన్ల ఎత్తివేత, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం డిమాండ్లతో నిరసనకు దిగారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు విధులకు హాజరుకాకూడదని నిర్ణయించారు.

